క్లుప్తంగా

బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై సమీక్ష



బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్షిస్తున్న మాచిరాజు లక్ష్మీనారాయణ

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ ఆలయ అర్చక, పురోహిత బృందంతో సమావేశం ఏర్పాటు చేశారు. వచ్చేనెల మే 1 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై ఈ సమావేశంలో సమీక్షించారు. శైవాగమ పండితులు యనమండ్ర సత్య సీతారామ శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు ఐదు రోజులపాటు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్టు కార్యనిర్వహణాధికారి తెలిపారు. మే 1 నుంచి బ్రహ్మోత్సవం, కల్యాణం వైభవంగా నిర్వహిస్తామన్నారు. దేవస్థానం వెబ్‌సైట్‌లో కల్యాణం టికెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఏర్పాట్లపై అర్చకులు, పురోహితులు, వేద పండితులతో చర్చించారు. బ్రహ్మోత్సవాల్లో గ్రామస్తులు, భక్తులు పాల్గొనాలని కోరారు.

ప్లాస్టిక్ తొట్టెల పంపిణీ

ఉప్పలగుప్తం: పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా జీవించవచ్చని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అన్నారు. విలసవిల్లిలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా 950 మందికి తడి చెత్త, పొడి చెత్త సేకరణకు ప్లాస్టిక్ తొట్టెలను మంగళవారం పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, మెండి శ్రీను పాల్గొన్నారు.

జేఈఈలో నవోదయ విద్యార్థుల ప్రతిభ



పాలెపు పేర్రాజు

యానాం: జేఈఈ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో యానాం నవోదయ విద్యాలయ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని మంగళవారం ప్రిన్సిపాల్ శరత్‌చంద్రకీర్తి తెలిపారు. విద్యార్థులు పాలెపు పేర్రాజు 96.02, యడ్ల భార్గవి 75.48, పాలిమారి హేమసుందర్ 67.01 పర్సంటైల్‌తో జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారని తెలిపారు. నవోదయ విద్యార్థులు జేఈఈలో అర్హత సాధించేలా ఆన్‌లైన్ క్లాసుల ద్వారా అత్యుత్తమ శిక్షణనిచ్చి గతంలో కంటే ఎక్కువ మంది ఎంపికయ్యేలా కృషి చేసిన అధ్యాపకులను ప్రిన్సిపాల్ శరత్ చంద్రకీర్తి అభినందించారు.

రోడ్డు విస్తరణకు చెట్ల తొలగింపు

అమలాపురం టౌన్: స్థానిక పదో వార్డు పరిధిలో ఉన్న సమతానగర్‌లో ప్రస్తుతం ఉన్న సన్న పాటి రోడ్డును 10 అడుగుల వెడల్పుతో విస్తరించేందుకు ఆ ప్రాంత పెద్దలు అంగీకరించారు. రోడ్డు విస్తరణకు అవసరమైన స్థలాన్ని ఇరు పక్షాలకు వివాదం లేకుండా పట్టణ ప్రణాళిక అధికారిణి రాణి సంయుక్త, తహసీల్దార్ అశోక్ ప్రసాద్, పట్టణ ఎస్సై టి.శ్రీనివాస్, వీఆర్వో సాధనాల ఏలేశ్వరరావు సమక్షంలో మంగళవారం సర్వే చేసి చెట్లను తొలగించే ఏర్పాట్లు చేశారు.

జిప్‌మర్‌లో రీసెర్చ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: పుదుచ్చేరిలో ప్రభుత్వ వైద్య రంగ సంస్థ జిప్‌మర్‌లో మెడికల్ రీసెర్చ్ కోర్సులైన పీడీఎఫ్, పీడీసీసీ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మంగళవారం జిప్‌మెర్ సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 24 సీట్లు ఉన్నాయని అందులో పీడీఫ్ 15, పీడీసీసీలో 9 సీట్లున్నాయని అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా మే 11లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మే 20 నుంచి 24 వరకు పరీక్ష అడ్మిట్‌కార్డు డౌన్‌లోడ్ చేసుకోవడం, మే 25న దేశవ్యాప్తంగా నాలుగు సెంటర్లలో బెంగుళూరు, చెన్నై, న్యూఢిల్లీ, పుదుచ్చేరిల్లో పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. జూన్ 5న ప్రవేశపరీక్ష ఫలితాలు విడుదల, సర్టిఫికెట్ల పరిశీలన, జూలై 1నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు.

ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించాలి

అమలాపురం రూరల్: రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు కనీస మద్దతు ధరకు విక్రయించాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. వన్నెచింతలపూడి రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఏవో కడలి ధర్మప్రసాద్, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, రైతు నాయకులు పాల్గొన్నారు.

డీఎస్సీలో వెయిటేజీ కల్పించాలి

ముమ్మిడివరం: ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న 16,347 మంది అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు, పార్ట్‌టైమ్ ఉద్యోగులకు వెయిటేజీ కల్పించాలని జిల్లా జేఏసీ అధ్యక్షుడు సీహెచ్ వెంకన్నబాబు విజ్ఞప్తి చేశారు. 15 ఏళ్లు పైబడి సమగ్ర శిక్ష అభియాన్‌లో తక్కువ వేతనాలతో విద్యారంగంలో పనిచేస్తున్నామని వారన్నారు.

కళ్లాల్లోనే ధాన్యం

- నత్తనడనక ధాన్యం కొనుగోళ్లు
- అరకొరగా కేంద్రాల ఏర్పాటు
- నిబంధనలు, టార్గెట్ల పేరుతో ధాన్యం కొనుగోళ్లకు అడ్డంకులు
- రైతుల ఆందోళన



రెడ్డిపల్లిలో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

అల్లవరం: రైతు పండించిన ప్రతి గింజను రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి గిట్టుబాటు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేయాల్సి ఉంది. ఆ దిశగా ప్రతి రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించి రైతు ఇష్ట ప్రకారం స్థానికంగా ఉన్న మిల్లులకు తరలించాల్సి ఉంది. దాళ్వాలో పండించిన పంటను రైతు ఇష్టం మేరకు విక్రయించవచ్చని ప్రభుత్వం సూచనలు చేస్తూనే మరో వైపు ధాన్యం కొనుగోలులో పరిమితులు విధిస్తున్నారు. దీంతో పండించిన పంటను అమ్ముకునే అవకాశం లేకపోవడంతో ఇంకా కళ్లాల్లోనే ధాన్యం దర్శనమిస్తోంది.

నిబంధనల మేరకు తేమ శాతం ఉంటేనే ధాన్యం కొనుగోలు అమలాపురం నియోజకవర్గ వ్యాప్తంగా దాళ్వా వరి కోతలు ప్రారంభమై పది రోజులు కావస్తున్నా నేటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి రాలేదు. అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసినా అక్కడ పూర్తి స్థాయిలో కొనుగోళ్లు జరగడం లేదు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఉండే సిబ్బంది ప్రభుత్వం నిర్దేశించిన తేమ శాతం ఉంటేనే కొనుగోలు చేస్తున్నారు. లేదంటే కొనుగోలు చేసే ప్రసక్తి లేదని సిబ్బంది తెగేసి చెబుతున్నారు. వరి కోతలకు కూలీలు రాకపోవడంతో యంత్రాలతో కోసిన ధాన్యంలో తేమ శాతం 17 శాతం కన్నా ఎక్కువగా ఉండడంతో రైతులకు సవాలుగా మారింది.



ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని రైతులకు వివరిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

అల్లవరం మండలంలో 4,020 ఎకరాల్లో దాళ్వాలో వరి సాగు చేశారు. దాళ్వాలో పండించిన పంటను కొనుగోలు చేసేందుకు 18 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి రైతుల నుంచి ఇప్పటి వరకు కేవలం 180 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. తొలి విడతగా 4,550 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు.

ప్రతి గింజనూ కొనుగోలు చేయాలి



రైతు పండించిన పంట అమ్ముకోవడానికి ఎలాంటి నిబంధనలు విధించకూడదు. ప్రభుత్వం నిర్దేశించిన టార్గెట్‌కు మించి ధాన్యం కొనరాదని అధికారులకు ఆదేశాలివ్వడం చాలా దారుణం. వాతావరణంలో మార్పులు వచ్చి ఆకాల వర్షాలు కురిస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారు. రైతు నష్టపోకూడదంటే ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రతి గింజను కొనుగోలు చేయాలి.

– కొనుకు బాపూజీ, రైతు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, అల్లవరం

ధాన్యం కొనుగోళ్లలో టార్గెట్లతో ఇబ్బందులు

ఉప్పలగుప్తం మండలం పరిధిలో 6,145 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇక్కడ 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి 233 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించారు. తొలి విడతగా 7,449 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. అమలాపురం రూరల్ పరిధిలో 5,120 ఎకరాలు వరి సాగు నిర్వహించారు. 22 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 5,820 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని సేకరించేందుకు టార్గెట్ నిర్దేశించుకున్నారు. అమలాపురం మండలంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. టార్గెట్‌కు మించి ధాన్యం కొనుగోలుకు అధికారులు సుముఖంగా లేకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలయ్యింది. టార్గెట్ల పేరిట ధాన్యం అమ్మకాలు నిలిచిపోతే వేలాది రూపాయలు వెచ్చించి పండించిన పంట కళ్లాల్లో ఉండిపోతే మా పరిస్థితి ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. దాళ్వాలో పండించిన ప్రతి గింజను ఏలాంటి అడ్డంకులు లేకుండా కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



తల్లిదండ్రులకు నూతన అడ్మిషన్ల పత్రాలను పంపిణీ చేస్తున్న డీవైఈవో

అమలాపురం టౌన్: తమ పిల్లలను నాణ్యమైన విద్యను అందించే ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని డీవైఈవో గుబ్బల సూర్య ప్రకాశం తల్లిదండ్రులకు సూచించారు. స్థానిక నారాయణపేటలోని లాల్ బహదూర్ శాస్త్రి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నిర్వహించిన స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ, తల్లిదండ్రుల సమావేశానికి డీవైఈవో సూర్యప్రకాశం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీవీఎస్‌సీ పోలిశెట్టి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో డీవైఈవోతో పాటు మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, ఎంఈవో ఎస్. దుర్గాదేవి కూడా ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతున్న క్రమంలో విద్యార్థులు ఈ పాఠశాలల పట్ల ఆకర్షితులవుతున్నారని కమిషనర్ రాజు అన్నారు. ఈ సందర్భంగా కొత్త అడ్మిషన్ల కోసం పాఠశాల ముద్రించిన పోస్టర్లను తల్లిదండ్రులకు పంపిణీ చేశారు. సమావేశంలో అమలాపురం డివిజన్ సత్య సాయి సేవా సంస్థల కో ఆర్డినేటర్ డాక్టర్ జి.ప్రభాకర్, స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ చైర్ పర్సన్ పి.సత్యవాణి, సీఆర్పీ ఎం.అనూష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ముగిసిన ఇంటర్న్‌షిప్

ఐ.పోలవరం: జిల్లాస్థాయిలో జెడ్పీ హెచ్ఎస్ ఐ. పోలవరం పీఎంశ్రీ హైస్కూళ్లలో 10వ తరగతి విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులకు సంబంధించిన అగ్రికల్చర్, ఆటోమోటివ్ ఇంటర్న్‌షిప్ తరగతులు ముగిసాయి. ఈ ఇంటర్న్‌షిప్ ఏప్రిల్ 4 నుంచి 16వ తేదీ వరకు దిగ్విజయంగా ముగిసినట్టు ప్రధానోపాధ్యాయుడు వీధి సురేష్‌బాబు మంగళవారం తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా ఐ. పోలవరంలోని గ్రోమోర్ ఫెర్టిలైజర్స్, బాణాపురంలోని పీచు పరిశ్రమను, ఆటోమోటివ్ వృత్తి విద్యలో భాగంగా యానాంలోని తేజోదయా బైక్ మెకానిక్ షాప్, కార్ కేర్ సెంటర్లను విద్యార్థులు సందర్శించారని హెచ్ఎం తెలిపారు. ఉత్తమ ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్స్ అందజేశారు.



ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థులతో హెచ్ఎం సురేష్‌బాబు తదితరులు

ఈ కార్యక్రమంలో గ్రోమోర్ ఫెర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ బ్రాంచ్ మేనేజర్ పంతం సీతారాం, ఉపాధ్యాయులు, ఒకేషనల్ ట్రైనర్స్ గంటా రమ్య, కె. సతీష్, కె. లావణ్య , విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ధరిత్రీ దినోత్సవం



అమలాపురంలో ధరిత్రీ దినోత్సవం సందర్భంగా సంస్కార భారతి ప్రతినిధులు తీర్చిదిద్దిన రంగవల్లులు

అమలాపురం టౌన్: ధరిత్రీ దినోత్సవాన్ని స్థానిక చంద్రమౌళేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సంస్కార భారతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని అలరించారు. రంగుల ముగ్గులతో ధరిత్రీ చిత్రాన్ని రూపుదిద్దారు. భారత మాత చిత్ర పటానికి పూల మాలలు వేసి పూజలు చేశారు. సంస్కార భారతి అధ్యక్షురాలు శ్రీగిరి పద్మావతి, కార్యదర్శి పీవీఆర్ నాయుడు, రంగోళి నిపుణురాలు వాసంశెట్టి శ్రీదేవి, సంస్కార భారతి సభ్యులు తదితరులు ముగ్గులను తీర్చిదిద్దారు.

అభాగ్యులకు అన్నదానం

తాళ్లరేవు: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొప్పిశెట్టి లక్ష్మయ్య బ్రహ్మర్పణ్ ఉచిత అభాగ్యుల భోజన పథకంలో భాగంగా మంగళవారం ఉంగరాల కుటుంబ సభ్యులు అన్నదానం చేసారు. పి.మల్లవరం గ్రామానికి చెందిన ఉంగరాల రామచంద్రరావు జయంతి సందర్భంగా అభాగ్యులకు భోజనాలు, బటర్‌మిల్క్, తువ్వాళ్లు అందజేసారు. కాకినాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, ధూళిపూడి శుభ, లయన్స్ ప్రతినిధులు పొన్నాడ రాజు, బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అభాగ్యులకు భోజనం అందజేస్తున్న దాతలు

గర్భిణులకు సీమంతం

ముమ్మిడివరం: పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గర్భిణులకు సీమంతం, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ విమల ఆధ్వర్యంలో ఆరుగురు గర్భిణులకు సీమంతం, ఐదుగురు పిల్లలకు అన్నప్రాసన చేశారు. ఈఓలు జీవీఎస్ఎన్ దేవి, జే.మీనాక్షి, సీహెచ్ పల్లవి, ఆకాష్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అందాల పోటీలో లేగ దూడల సందడి



లేగదూడల అందాల పోటీని ప్రారంభిస్తున్న నిర్వాహకులు, రైతులు



అందాల పోటీలో ప్రదర్శనకు ఉంచిన లేగదూడలు

అమలాపురం రూరల్: వన్నెచింతలపూడిలో మంగళవారం నిర్వహించిన లేగ దూడల అందాల పోటీలు, ప్రదర్శన కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. పశు వైద్యాధికారి డాక్టర్ పూర్ణిమ నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ ప్రదర్శనను సర్పంచ్ నక్కా రాజారత్నం నాగవాణి అధ్యక్షత వహించారు. జిల్లా పశు వైద్య అధికారి కొమ్ము వెంకటరావు, ఉపసంచాలకులు డాక్టర్ కర్నేడి మూర్తి, సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్ విజయరెడ్డి, చీకట్ల నారాయణ దూడలను పరిశీలించి బహుమతులకు ఎంపిక చేశారు. అందాల పోటీల్లో ప్రథమ బహుమతి నక్కా శేషగిరిరావుకు చెందిన పుంగనూరు ఆవు దూడకు, ద్వితీయ బహుమతి నడింపల్లి కాశీ విశ్వనాథరాజుకు చెందిన గిర్ ఆవుకు, తృతీయ బహుమతి మామిడిపల్లి బాబుకు చెందిన పుంగనూరు ఆవు దూడకు అందజేశారు. జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ కే వెంకట్రావు పాడి రైతుల పలు సూచనలు చేశారు. కేవలం 288 రూపాయలకు పశువులకు మూడేళ్లకు రూ.30 వేలు విలువైన ప్రభుత్వం పశు బీమా అమలు ఉందన్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, ఎంపీటీసీ పరమట నాగమణి, పశు వైద్యులు డాక్టర్ మాధురి, డాక్టర్ నారాయణ రావు, పశు వైద్య సిబ్బంది, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అజయ్‌కుమార్



అమలాపురం టౌన్: అమలాపురం బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవంగా మంగళవారం జరిగాయి. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది చింతపల్లి అజయ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా యాలంగి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా దొమ్మేటి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా పి.వీరభద్రరావు, లైబ్రేరీ సెక్రటరీగా కూచిమంచి శశిధర శ్రీరామ్, కోశాధికారిగా నందెపు చిన వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా సీనియర్ న్యాయవాదులు మహ్మద్ ఆజామ్, నల్లా ప్రభాకర్, అడపా వెంకటసత్యప్రసాద్, నడింపల్లి సీతారామరాజు, కేఎస్‌సీహెచ్ మోహన్, వైవీఎస్ఎస్ఎన్ ప్రసాద్, కళా వెంకట్రావు, అబ్బిరెడ్డి సురేష్, కేవీవీ శ్రీనివాసరావు, దాసరి శ్రీలత, పీవీ ఆనందప్రసాద్, సత్యనారాయణ ఎల్‌బీలు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది కటికదల సత్యనారాయణ వ్యవహరించారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు అజయ్‌కుమార్ అన్నారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడు అజయ్‌కుమార్ అమలాపురానికి చెందిన దివంగత స్వాతంత్ర్య సమరయోధుడు, సీనియర్ పాత్రికేయుడు చింతపల్లి కృష్ణమూర్తి కుమారుడు. ఈయన గతంలో అమలాపురం ఏపీపీగా కూడా పనిచేశారు. అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని తోటి న్యాయవాదులు అభినందించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులకు సత్కారం

తాళ్లరేవు: కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన ఏలూరి సుబ్రహ్మణ్యంను పీఎంపీ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం సత్కరించారు. కమ్యూనిటీ పారామెడిక్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్ వెల్ఫేర్ అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు కొప్పాడి శివప్రసాద్, ప్రతినిధి కృష్ణ కిషోర్ పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా పటవల గ్రామానికి చెందిన చెక్కపల్లి వీరభద్రరావు(చంటి) ఎన్నికవడంతో పలువురు ఆయనను సత్కరించి, అభినందించారు.

స్థానిక ఎన్నికల్లో ఓబీసీ కోటాపై త్వరలో నివేదిక

యానాం: పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్‌లో స్థానిక సంస్థలైన మున్సిపాలిటీలు, కమ్యూన్ పంచాయతీల్లో ఓబీసీ రిజర్వేషన్లకు సంబంధించి ప్రామాణికమైన నివేదికను త్వరలో సమర్పించేందుకు కట్టుబడి ఉన్నామని మంగళవారం మద్రాసు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శశిధరన్ చైర్‌పర్సన్‌గా ఉన్న ఏక సభ్య కమిషన్ స్పష్టం చేసింది. ఓబీసీలకు సీట్లు రిజర్వు చేసి అనంతరం స్థానిక ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించి 2021, డిసెంబర్ 17న ప్రభుత్వం జస్టిస్ శశిధరన్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసింది. ఖచ్చితమైన డేటా సేకరణ, శాస్త్రీయ విశ్లేషణల ద్వారా నివేదిక తయారవుతుందని ఆయన అన్నారు.

అదనపు బాధ్యతలు తొలగింపు

యానాం: వచ్చే ఏడాది మార్చి నెలలో పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌గా ఉన్న జవహర్, ఐఏఎస్‌ను అదనపు బాధ్యతల నుంచి తప్పిస్తూ మంగళవారం లెఫ్టినెంట్ గవర్నర్ కె కై లాషనాథన్ ఆదేశాలు జారీ చేశారు. భారత ఎన్నికల సంఘం లేఖకు అనుగుణంగా జవహర్‌పై ఉన్న వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి బాధ్యతలను ఉపసంహరించుకుంటున్నట్లు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రభుత్వం పరిశ్రమలు, విద్యుత్‌తో సహా ఐదు శాఖలను ప్రభుత్వం జవహర్‌కు కేటాయించింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలను పరిగణనలోకి తీసుకుని ఆయనకు కేటాయించిన అదనపు బాధ్యతలను తప్పించాలని ఇటీవలి ఎన్నికల సంఘం పుదుచ్చేరి ప్రభుత్వానికి లేఖ రాసింది.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

అమలాపురం రూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అమలాపురం డిపో వద్ద మంగళవారం ఆర్టీసీ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. డ్రైవర్ టీఎస్ నారాయణకు అమలాపురం డిపోలో పోస్టింగ్ ఇవ్వాలని ఎస్ఎంయూ, యునైటెడ్ వర్కర్స్ యూనియన్ల ఆధ్వర్యంలో గ్యారేజ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఎస్ఎంయూ కోనసీమ జిల్లా కార్యదర్శి పి. రాంబాబు, డిపో అధ్యక్షుడు ఎండీ ఔలియా, కార్యదర్శి పితాని మణిరాజు, యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గణపతి, గ్యారేజ్ కమిటీ కార్యదర్శి గౌరీనాథ్ పాల్గొన్నారు.



అమలాపురం ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

యానాం: నియోజకవర్గానికి విద్యుత్ సరఫరా చేస్తున్న 220 కేవీ కాకినాడ సబ్‌స్టేషన్, 132 ప్రతాప్ నగర్ సబ్‌స్టేషన్లలో ఏపీ ట్రాన్స్‌కో వార్షిక మరమ్మతులు చేపడుతున్నందున ఈనెల 23 బుధవారం నియోజకవర్గమంతా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మంగళవారం విద్యుత్ శాఖాధికారులు ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.


తాండవపల్లిలో రేపు బాణసంచా వేలం

అమలాపురం రూరల్: నడిపూడి పరిధిలో 2024 అక్టోబర్ 29న తాలూకా పోలీసులకు పట్టుబడిన భారీ బాణసంచాకు గురువారం తాండవపల్లి పరిధి శెట్టిపల్లిలో గుత్తుల ఏడుకొండల స్వామి బాణసంచా షెడ్డు వద్ద బహిరంగ వేలం నిర్వహిస్తామని ఎస్సై శేఖర్‌బాబు తెలిపారు. నడిపూడి పెదవీధిలో ఒక ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.1,69,650 విలువచేసే భారీ బాణసంచాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఈ కేసులో నటరాజు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు స్వాధీనం చేసుకున్న బాణసంచాను వేలం వేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

డిప్యూటీ సీఎం పదవికి పవన్ కల్యాణ్ రాజీనామా చేయాలి

అమలాపురం రూరల్: పిఠాపురం నియోజకవర్గం మల్లం గ్రామంలో దళితుల సాంఘిక బహిష్కరణకు కారణమైన వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, ఈ ఘటనకు పవన్ కల్యాణ్ బాధ్యత వహిస్తూ తక్షణమే డిప్యూటీ సీఎం పదవికి రాజీనామా చేయాలని వీకేసీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ డిమాండ్ చేశారు. మంగళవారం సురేష్ కుటుంబ సభ్యులను వీకేసీ పార్టీ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ఈనెల 16న మల్లంలో విద్యుదాఘాతానికి గురైన సురేష్ మృతి చెందడంతో అతని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దళితుల ఆత్మ గౌరవానికి భంగం కలిగే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరించిందన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసీరావు, వీకేసీ పార్టీ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి మెండి డేవిడ్ అంబేడ్కర్, నాయకులు పెయ్యాల ప్రతాప్, పీడీఎస్‌యూ నేత సాపే రమేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పూర్వజన్మ సుకృతం



అబ్బాస్ మాస్టారి సన్మాన సభలో మాట్లాడుతున్న డీఈవో సలీం బాషా

ఐ.పోలవరం: ఉపాధ్యాయ వృత్తి చేయడం అనేది పూర్వ జన్మ సుకృతమని జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం బాషా అన్నారు. మంగళవారం ఐ.పోలవరం మండలంలోని పశువులంక జిల్లా ప్రజా పరిషత్తు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మీర్జా హైదర్ అబ్బాస్ పదవీ విరమణ సన్మాన సభలో డీఈవో సలీం బాషా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీఎస్ఎన్ మూర్తి అధ్యక్షత వహించిన ఈ సభలో ఉపాధ్యాయులు, నాయకులు మాట్లాడుతూ హైదర్ మాస్టారు సేవలను కొనియాడరు. ఆయనను ఉపాధ్యాయులు, అభిమానులు స్నేహితులు, బంధువులు ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు కొండారెడ్డి, సురేష్ బాబుతో పాటు ఎం పెంటు సాహెబ్, పి సుబ్బరాజు, సత్యనారాయణ రాజు, మేడిది భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పీడబ్ల్యూడీ అధికారులతో సమీక్ష

యానాం: ప్రజాపనుల శాఖ (పీడబ్ల్యూడీ) అధికారులతో వివిధ పనులు పురోగతిపై మంగళవారం ఆర్ఏఓ ఆఫీసులో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సమీక్షించారు. ఆర్ఏఓ మునిస్వామి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పీడబ్ల్యూడీ ఇంజనీర్లు, మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ రామకృష్ణ పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు విశేష పూజలు

తాళ్లరేవు: ఇంజరం కామిరెడ్డివారి వీధిలో కనకదుర్గమ్మవారి ఆలయ 9వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కాకరపర్తి బాబీ శర్మ విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఏకాదశ ద్రవ్యాలతో అభిషేకం, విశేష కుంకుమార్చన, దుర్గా హోమం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని జామకాయల తూము వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మునసా అప్పలరాజు (24) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు కాకినాడ తూరంగి గ్రామానికి చెందిన అప్పలరాజు మట్లపాలెం ద్విచక్ర వాహనంపై వచ్చి తిరిగి వెళుతుండగా అదుపతప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన అప్పలరాజును స్థానికులు అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.